# ఇరువదిరెండవ ప్రసంగము

ఆరోజులలో శ్రీ ప్రకాశానందస్వామివారు గోండాలులో నుండిరి. అక్కడ స్వామివారిని దర్శించుటకు రాజకోటనుండి మోహన్ భాయి, శాస్త్రి రేవాశంకర్ భాయి మొదలగువారు వచ్చిరి. చందు భాయికూడ సమీపముననే కూర్చొనియుండిరి. ఆసమయమున పీఠడియా ప్రసంగము వచ్చెను. చందుభాయి శ్రీనిత్యానందస్వామి వారిని దర్శించవలెనను కుతూహలమును వ్యక్తపరచెను. అంతట అందరును శ్రీప్రకాశానందులవారిని కూడ తీసికొని పీఠడియా వెళ్ళిరి. శ్రీనిత్యానందులవారి కోరికప్రకారము శ్రీప్రకాశానంద స్వామివారు అందరిని పరిచయము చేసిరి. శాస్త్రిగారినిగురించి ఇట్లు పలికిరి. "శాస్త్రిగారు మహావిద్వాంసులు. రాజకోటయందలి రాజ కుమారకళాశాలలో ఉద్యోగముచేసిరి. ప్రస్తుతము సంస్కృతకళా శాలలో అధ్యాపకులు." శాస్త్రిగారు చెప్పిరి. "నాకు నైష్ఠికబ్రహ్మ చర్యమున కాలము గడపవలెనని కోరికయుండెడిది. ఆయుద్దేశ్య ముతో నేను వారణాసికి వెళ్ళిపోతిని. మనదేశమునకు తిరిగి రాలేదు. కాని నాసోదరి కాశీకివచ్చి గృహస్థాశ్రమమును తీసికొనమని చాల పట్టుపట్టినది. ఆమె నన్ను ఇంటికి తీసికొనివచ్చినది. శ్రీప్రకాశానంద స్వామివారుకూడ నాసోదరి చెప్పినమీదట గృహస్థాశ్రమమునకు నన్ను ప్రోత్సహించిరి. అంతట నేను స్వామివారిని ప్రశ్నించితిని. "తమరు నన్ను గృహస్థాశ్రమమునకు తొందరచేయుచున్నారుకదా! తమరు గృహస్థాశ్రమమును తీసికొనకుండ సన్యసించుటకు కారణ మేమి ?"

## శ్రీప్రకాశానందస్వామివారి వినోదము

స్వా. ప్ర :—అదే నేను సన్యసించి చింతించుచున్నాను. నేను డబ్బు పుచ్చుకొనకూడదు. అడిగికొనిన మధుకరము దొరకదు.

దగ్గర డబ్బులేదు. బట్టలు లేవు. చలిలో ఉండవలసి వచ్చుచున్నది. హృషీకేశమున జబ్బుపడినప్పుడు చాల బాధపడితిని. నాపరిస్థితి కుకట-పరిస్థితితో సమానముగా నుండెను. పూర్తిగా వైరాగ్యము కలిగిననే సన్యసించుము.

*విరక్తః ప్రవ్రజేద్ధీమాన్ సరక్తస్తు గృహే వసేత్ ।*
*సరక్తో నరకం యాతి ప్రవ్రజన్ హి ద్విజాధమః ॥*

"బుద్ధిమంతుడగు ద్విజుడు వైరాగ్యము పొందినమీదటనే సన్యసించవలెను. సంసారమునందు రాగము ఉన్నచో గృహస్థాశ్రమమునందు ఉండుటయే మంచిది. రాగము కలవాడు సన్యసించినచో ఆ అధమునకు నరకము కలుగును." కావుననే నేను శాస్త్రిగారికి గృహస్థాశ్రమమును స్వీకరించుడని సలహా చెప్పితిని.

శాస్త్రి:— శ్రీప్రకాశానందస్వామివారు ఆవిధముగా తెలియ జెప్పినమీదట నేను గృహస్థాశ్రమమును స్వీకరించితిని. ఇప్పుడు మోహం మొత్తినది. పిల్లలను పెంచుటకొరకు ఈజంజాటములో పడ వలసివచ్చుచున్నది.

స్వా. ని. :— గృహస్థాశ్రమమును స్వీకరించుటలో తప్పు ఏమియు లేదు. గృహస్థాశ్రమమునందు ఉండియే పురుషార్థమును సిద్ధింపజేసికొనవలెననిన జరుగగలదు. కోటయందు ఉండి పోట్లాడుటచే రక్షణ ఉండునుకదా! మైదానములోనికి వచ్చి యుద్ధముచేయుట విపత్కరము. అటులనే గృహస్థాశ్రమమున ఉండి జ్ఞానమును సంపాదించుటయందు రక్షణ యుండును.

## గృహస్థాశ్రమ ప్రాధాన్యము.

వేదములు, ఉపనిషత్తులు, స్మృతులు, ధర్మశాస్త్రములు అన్నియు గృహస్థాశ్రమముయొక్క ఉపయోగమును తెలిపినవి. తైత్తిరీయశిక్షయందు ఆచార్యుడు శిష్యునకు ఉపదేశించెను.

"ఆచార్యాయ ప్రియం ధనమాహృత్య ప్రజాతన్తుం మా వ్యవచ్ఛేత్సీః"

"ఆచార్యునకు గురుదక్షిణగా కోరిన ధనము నిచ్చి, సంతోష పరచి, వారి ఆజ్ఞానుసారము గృహస్థాశ్రమమును తీసికొనవలెను. అంతేకాని నైష్ఠికబ్రహ్మచారిగా గురుగృహమున ఉండి ప్రజాతంతువును ఉచ్ఛేదము చేయకుము."

మనుభగవానుడు గృహస్థాశ్రమమునందు మిక్కిలి విలువను కనపరచెను.

ఋణాని త్రీణ్యపాకృత్య మనో మోక్షే నివేశయేత్ ।
అనపాకృత్య మోక్షం తు సేవమానో వ్రజత్యధః ॥

"మూడు ఋణములను తీర్చినమీదట మనస్సును మోక్షమునందు నియోగించవలెను. ఆ ఋణములను దీర్చకుండ మోక్షమును సేవించువాడు అధఃపతితు డగును."

అనధీత్య ద్విజో వేదానసుత్పాద్య తథాత్మజాన్ ।
అనిష్ట్వా చైవ యజ్ఞైశ్చ మోక్షమిచ్ఛన్ పతత్యధః ॥

"ఏద్విజుడైనను (బ్రాహ్మణుడు క్షత్రియుడు, వైశ్యుడు) వేదములను చదువనిదే, పుత్రులను కననిదే, యజ్ఞాదులచే దేవతలను సంతృప్తి పొందించనిదే మోక్షమును కోరువాడు అధఃపతితు డగును."

యథా వాయుం సమాశ్రిత్య వర్తన్తే సర్వజన్తవః ।
తథా గృహస్థమాశ్రిత్య వర్తన్తే సర్వ ఆశ్రమాః ॥

"ప్రాణులన్నియును వాయువును ఆశ్రయించి జీవించును. అటులనే ఆశ్రమములన్నియు గృహస్థాశ్రమమును ఆశ్రయించి జీవించును."

యథా నదీనదాః సర్వే సముద్రే యాన్తి సంస్థితిమ్ ।
తథైవాశ్రమిణః సర్వే గృహస్థే యాన్తి సంస్థితిమ్ ॥

"నదులు, నదములు అన్నియును సముద్రములోనికి వెళ్ళి ఆగును. అటులనే అన్ని ఆశ్రమముల వారును గృహస్థాశ్రమమును ఆశ్రయించెదరు."

శ్రీమద్భాగవతమునకూడ కశ్యపుడు దితితో చెప్పెను:—

తస్యాః కామం న కః కుర్యాత్ సిద్ధిః త్రైవర్గికీ యతః ।

"భార్యసాహచర్యముచే ధర్మ, అర్థ, కామములను మూడు పురుషార్థములును సిద్ధించును. అట్టి భార్యను ఎవడు కోరడు?"

సర్వాశ్రమానుపాసాయ స్వాశ్రమేణ కలత్రవాన్ ।
వ్యసనార్ణవమత్యేతి జలయానైర్యథార్ణవమ్ ॥

"అన్ని యాశ్రమములకు అండయగుటకు గృహస్థాశ్రమమున భార్యను చేబట్టి, నౌకసహాయమున సముద్రమును దాటునట్లు, దుఃఖసాగరమును దాటును."

యామాహురాత్మనో హ్యర్ధం శ్రేయస్కామస్య మానిని।
యస్యాం స్వధురమధ్యస్య పుమాంశ్చరతి నిస్పృహః॥

"ఓ సుందరీ! భార్య తనశరీరములో అర్ధభాగమని కల్యాణమును కోరువాడు అనుకొనును. ఆమెయందు గృహభారమును ఉంచి పురుషుడు నిశ్చింతగా సంచరించును."

యామాశ్రిత్యేన్ద్రియారాతీన్ దుర్జయానితరాశ్రమైః।
వయం జయేమ హేలాభిః దస్యూన్ దుర్గపతిర్యథా॥

"కోటకల రాజు శత్రువులను తేలికగా జయించును. అటులనే బ్రహ్మచర్య సన్యాసాది ఇతర ఆశ్రమములద్వారా జయించలేని ఇంద్రియములనెడు శత్రువులను మనము ఒకభార్య సహకారముచే సులభముగా జయించెదము." అనగా గృహస్థాశ్రమమున భార్య కోటవంటిది. ఇంద్రియములను అదుపులో నుంచుకొనవలెననిన ఆ ఆశ్రమమే కావలెను.

బృహదారణ్యకమునందలి పంచాగ్నివిద్యయందుకూడ చెప్పబడినది.

తద్యథా పంచమ్యామాహుతావాపః పురుషవచసో భవన్తి॥

ఈవిధముగా పంచమ ఆహుతియందు సహకరించిన అధికారి పురుషరూపమును పొందును. అచ్చటనే "యోషా వాఽగ్నిర్గౌతమ" "ఓగౌతమ! స్త్రీ పంచమాగ్ని"ని అ చెప్పబడినది.

ఈవిధముగా స్త్రీని 5వ అగ్నిగా పరిగణించిరి. ఆశ్రమములలో కెల్ల గృహస్థాశ్రమమును అజేయమగు కోట అనియు, అన్ని ఆశ్రమములకును ఆధారమనియు వర్ణించిరి. జనకుడు, వశిష్ఠుడు, యాజ్ఞవల్క్యుడు వీరందరును గృహస్థాశ్రమమునందు ఉండియే ఉత్తమ జ్ఞానమును పొందిరి. ఇట్టి దృష్టాంతములు అనేకము కలవు. వివేకవైరాగ్యములు లేనిదే సన్యాసమును తీసికొని సన్యాసాశ్రమమును పాడుచేయు సన్యాసులకంటెను, లేక అట్టి నైష్ఠికబ్రహ్మచారులకంటెను ఈగృహస్థాశ్రమములోనివారు ఎంతయో మంచివారు. కావున మీకు శ్రీ స్వామిప్రకాశానందులవారు గృహస్థాశ్రమమును తీసికొనమని చెప్పియున్నచో శాస్త్రదృష్టిని తగిన సలహాయే చెప్పిరి. అంతేకాక అధ్యయన, అధ్యాపనములు బ్రాహ్మణధర్మములు. ప్రాచీనకాలమున వేతనము తీసికొనకుండగనే ఆచార్యులు అధ్యాపనము చేసెడివారు. కాని ఇప్పుడు అట్లు జరుగుటలేదు. అందుచే జీతము తీసికొనినను ఈబ్రాహ్మణవృత్తి ఉత్తమము. సరే, మరియొక ప్రవచనము నేడైనచేసెదరా? లేదా?

శాస్త్రి:— జనుల కోరికప్రకారము పంచనాథమునందు (శివాలయమునందు) గీతాదులప్రవచనము చేయుచుందును.

మహాభారతమునందు చెప్పబడినది కదా!

*యుగాన్తే సమనుప్రాప్తే వృథైవ బ్రహ్మవాదినః ।*

"ద్వాపరయుగాన్తము అయినతరువాత అనగా కలియుగమునందు అనుభవములేనిదే అనేకమంది వ్యర్థముగా బ్రహ్మవాదము చేయుదురు."

అదేవిధముగ నేనుకూడ నాలుగు అక్షరములు చదువుకొని అనుభవములేకుండ అధికప్రసంగము చేయుదును.

స్వా. ని. :— అందులో దోషము ఏమి ఉన్నది? శ్రవణము చేసిన విషయమున మననిదిధ్యాసనములు జరుగునుకదా! వారికి శ్రవణముచేయించుట ఉత్తమమగు కార్యము. దైవప్రకృతికల ప్రవక్తలు ప్రవచించుసమయమున గీతయందలి "ఇంద్రియార్థేషు వైరాగ్యమ్" అను వచనమును వివరించుచు తమయందు వైరాగ్యములేనిచో చెప్పుటకు సంకోచించెదరు. అనంతరము వైరాగ్యాది దైవసంపదను సంపాదించెదరు. అసురసంపదకల ప్రవక్తలు ఎట్లు తోచిన అట్లు మాట్లాడెదరు. మనస్సుకు ఏమియు మార్పును రానీయరు. పైగా విషయలంపటులుకూడ నగుదురు. ఇట్లు ప్రవచనమునందు లాభనష్టములు రెండును కలవు. ఈసంగతి తెలిసికొని ప్రవచనములు చేయవలెను.

అటుతరువాత శ్రీనిత్యానందస్వామివారు శ్రీప్రకాశానందస్వామివారిని ప్రశ్నించిరి. పూర్వము మీరు రెండుకర్రలు దగ్గరనుంచుకొనెడివారు కదా? ఇప్పుడు ఒకకర్రయే ఎందుకు ఉంచుకొనుచున్నారు?

## ద్వైతాద్వైతముల వినోదము.

స్వా. ప్ర. :—మూడు సంవత్సరములకుపూర్వము రాజకోటకు నారాయణపరమహంస అని పేరుగల ఒక చాలగొప్పమహాత్ముడు వచ్చెను. ఆయన దర్శనమునకు నేను వెళ్ళితిని. వారు మిక్కిలి విరక్తికలవారుగా కన్పట్టిరి. తరువాత వారిజాడ తెలియలేదు. రెండుసంవత్సరములతరువాత 'చాందోద' నుండి 'కరనాలి' వెళ్లుచుంటిని. నాతో నున్నవారు "హనుమంతేశ్వరమునందు గొప్పమహాపురుషుడు ఒకరు కలరు. వారిదర్శనమునకు మీరు అక్కడకు వచ్చెదరా?" అని అడిగిరి. నేనుకూడ వారివెంట వెళ్ళితిని. వారు పంచ

కేశములను ధరించియుండుటచే నేను వారిని గుర్తించలేకపోయితిని. కాని వారు నన్ను గుర్తించిరి. ఆసమయమున వారు మౌనమును అవలంబించియుండిరి. వారు వ్రాసి నన్ను ప్రశ్నించిరి. "మిమ్ము రాజ కోటలో చూడలేదా?" దీనితోపాటు వారు పరిచయమునకు సంబంధించి కొన్ని సంగతులనుకూడ జ్ఞాపకము చేసిరి. "తమకు అన్నియును జ్ఞాపకము ఉన్నవే" అని నేనంటిని. "దొంగతనముగా ఇక్కడ కూర్చొని ఉన్నారా?" అంటిని. కాని వారు సంజ్ఞతో తెలిపిరి. "మీరు నన్ను గుర్తుపట్టలేదు. నేను మిమ్ము గుర్తుపట్టితిని. కావున మీరు దొంగ." నాదగ్గర రెండుకర్రలు చూచి సంజ్ఞతో ప్రశ్నించిరి. "రెండు ఏల నుంచుకొనిరి?" నేను చెప్పితిని. "ఇంకను నాకు ద్వైత భావము పోలేదు. అందుచే రెండుకర్రలు ఉంచుకొనియున్నాను." ఆయన నాదగ్గరనున్న కర్రలలోనుండి ఒకదానిని తాను తీసికొని రెండవదానిని నాకు ఇచ్చి సంజ్ఞతో ఒకవ్రేలును చూపించి చెప్పిరి. "ఇప్పుడు అద్వైతము కుదిరినదా?" నేను ప్రశ్నించితిని. "నాకు అద్వైతోపదేశము నిచ్చుచున్నారా?" అంతట వారు నమస్కరించి సంజ్ఞ చేసిరి. "కాదు, కాదు." అప్పటినుంచియు ఒకటే ఉంచుకొనుచున్నాను.

స్వామిశ్రీనిత్యానందులవారు శాస్త్రిగారిని ప్రశ్నించిరి. "ద్వైతము, అద్వైతము, విశిష్టాద్వైతము మొదలగు పేర్లతో ప్రచారములోనున్న మతములలో ఏమతము నిజమైనది?"

## ప్రచారములోఉన్న మతములు.

శాస్త్రి:— అధికారులను దృష్టిలోనుంచికొని ఆలోచించిన అన్ని మతములును నిజమైనవే.

జగమునందలి మానవులందరికిని నిశ్శ్రేయసము సిద్ధించుటకొరకు అకారణహితేచ్ఛువగు వ్యాసమహర్షి ఇట్లు వక్కాణించెను.

"అథాతో బ్రహ్మజిజ్ఞాసా"

ఇట్లు ప్రతిజ్ఞచేసి వ్యాసభగవానుడు బ్రహ్మనిరూపణముకొరకు అనగా ఆత్మ నిరూపణముకొరకు సూత్రములను రచించెను. ఆసూత్ర సముదాయము వేదాంతదర్శన మనబడును. ఆసూత్రములు చాలసంక్షిప్తముగను, గూఢార్థముకలవిగను ఉన్నవి. ఆసూత్రములయందు చతుర్వేదప్రతిపాద్యము బ్రహ్మము అనునది సాధించబడినది. ద్వైత విశిష్టాద్వైత, శుద్ధాద్వైత, కేవలాద్వైతములను నాల్గింటిని ప్రతిపాదించిన ఆచార్యులు పైసూత్రములను ఆధారముగా చేసికొనియే తమ తమ సిద్ధాంతములను ప్రతిపాదించిరి. ద్వైతసంప్రదాయప్రవర్తకులగు ఆచార్యులు మధ్వశ్రీ ఆనందతీర్థులు. వారు జీవ, బ్రహ్మముల వాస్తవికభేదమును అంగీకరించిరి.

విశిష్టాద్వైతప్రవర్తకులు శ్రీరామానుజాచార్యులు. వారు జీవ, ఈశ్వరులకు శరీర, శరీరిసంబంధము కలదని–అనగా అవినాభావ సంబంధము కలదని విశదీకరించిరి. "శరీరమునకు జీవుడు ఉన్నట్లుగ నే పరమాత్ముడు ఉన్నాడు" అని "తత్త్వమసి" పదమునకు వారు అర్థము చెప్పిరి. ఈకారణముచేతనే అద్వైతపదము విశిష్టాద్వైత శబ్దమునందున్నను వారు అద్వైతవాదులుకారు.

శుద్ధాద్వైతప్రవర్తకులు వల్లభాచార్యులు. ఆయనజీవుని అణు–పరమాణురూపమున అంగీకరించి పరమాత్మని అంశముగా స్వీకరించిరి. కాని వాస్తవికఐక్యము ఉండుటకతమున అంశాంశిభావమునకు తావు లేదు. కావున ఈమతము నిజమునకు ద్వైతమునందు లీనమగుచున్నది.

అద్వైతసంప్రదాయము శ్రుతిసిద్ధాంతము. దీని ప్రవర్తకులు శ్రీశంకరాచార్యులవారు. తమభాష్యత్రయమునందు జీవబ్రహ్మలకు ఐక్యమును ప్రతిపాదించిరి.

పైనచెప్పిన నాలుగు అభిప్రాయములునుకాక నీలకంఠభాష్యాది వివిధసిద్ధాంత ప్రతిపాదకములగు అనేక భాష్యములు ఈసూత్ర

ములపై వ్రాయబడినవి. అవి దేశపరిస్థితులయందలి పరివర్తనములతో బాటు వేర్వేరు అధికారులకొరకు, వేర్వేరు దేశములయందు వేర్వేరు కాలములయందు ఉపయోగించబడినవి. అయినను వేదాంతముయొక్క అంతిమధ్యేయము ఒక్కటే అనునది నిశ్చితాభిప్రాయము.

పరస్పరవిరుద్ధములగు అనేకమతములను బాదరాయణుడు తన 550 సూత్రములద్వారానే ఎట్లు ప్రతిపాదించును? అయితే బ్రహ్మసూత్రప్రతిపాద్యమేమి? వేదాంతమునందలి(ఉపనిషత్తులయొక్కయు, మంత్రములయొక్కయు) అర్థమును నిర్ణయించుటయే తెలియనగు వేదాంతప్రతిపాద్యము ఏమి అనునదియే బ్రహ్మసూత్రములు నిశ్చయించవలెను కదా! అందుచే "తత్త్వమసి" ప్రకరణమును కొంత విచారించెదము.

## పాండిత్య దురభిమానము.

సామవేదీయ ఛాందోగ్యోపనిషత్తునందలి ఆరవ అధ్యాయములో ఒకకథ ఉన్నది. ఉద్దాలకుడు (లేక ఆరుణి) అను పేరుగల ఒకఋషికి శ్వేతకేతుడను చపలుడగు కుమారుడు ఉండెను. కుమారుని తండ్రి గురుగృహమునకు అధ్యయనమునకై పంపెను. ఆరోజులలో 8 సంవత్సరముల బాలుడే గురుకులమునకు వెళ్ళెడివాడు. కాని శ్వేతకేతువు12సంవత్సరములవరకును గురుగృహమునకు వెళ్ళుటకు సిద్ధమవలేదు. అతని చపలత్వము స్వేచ్ఛాజీవితముగా మారుచుండెను. ఇది చూచి 12 వ సంవత్సరమున పంపవలసి వచ్చెను. ఆతడు 12 సంవత్సరములు గురుగృహమున అధ్యయనముచేసి మరలి వచ్చెను. ఆకారణముచే అతనికి "నేనే విద్వాంసుడను" అనుగర్వము కలిగెను. నాతండ్రిగారియందును ఇతరులయందును, నాకున్నంత విద్య లేదు. వారికి నేను ఏల నమస్కరించవలెను? ఈ ఉద్దేశ్యముతో వచ్చినంతనే వినయవివేకములులేక ఏవిధమయిన మర్యాదలను పాటించ

లేదు. తండ్రికి వందనమైన చేయలేదు. ఆకారణముచే తండ్రికి [illegible] ఖేదము కలిగి ఆకుమారునికి గల గర్వము పోగొట్టి సదాచారములను నేర్పు ఉద్దేశముతో ప్రశ్నించెను.

*తం హ పితోవాచ శ్వేతకేతో యన్ను సౌమ్యేదం మహామనా అనూచానమానీ స్తబ్ధోఽస్యుత తమాదేశమప్రాక్ష్యో యేనాశ్రుతంశ్రుతం భవతీత్యాది.*

"ఓ శ్వేతకేతూ! ఓసౌమ్యుడా? నీవు విద్యాగర్వముచే వినయహీనుడవయితివి. ఏవిషయమును తెలిసికొనుటచే ఈలోకమున శ్రవణ విషయముకాని పదార్థముకూడ శ్రవణముచేయబడినదిగా ఏర్పడునో అట్టివిషయమును గురువుగారిని ప్రశ్నించి వారి యుపదేశముద్వారా గ్రహించితివా?" అని తండ్రి ఉద్దాలకుడు అడిగెను.

అంతట శ్వేతకేతువు ప్రశ్నించెను.

*"కథం ను భగవః స ఆదేశో భవతి" ఇతి।*

"పూజ్యుడవగు ఓతండ్రీ! అట్టిపదార్థము ఏమైన కలదా? ఏ ఒకపదార్థమును తెలిసికొనినంతమాత్రమున సర్వపదార్థములును తెలిసికొనుటకు వీలగునో అట్టి వస్తువేమైన కలదా?"

## సచ్చిదానంద రూపము.

తండ్రి చెప్పెను.

*యథా సౌమ్యైకేన మృత్పిణ్డేన సర్వం మృణ్మయం విజ్ఞాతం స్యాత్ వాచారమ్భణం వికారో నామధేయం మృత్తికేత్యేవ సత్యం ఏవం సౌమ్య స ఆదేశో భవతీతి।*

"ఓకుమారా! మట్టియొక్క వికారములగు కుండ, కడవ మొదలగువానియందు ఉపాదానకారణమగు మృత్పిండము తెలిసినచో మృద్వికారములగు పాత్రములన్నిటి జ్ఞానమును కలుగునట్లు గనే సత్, చిత్, ఆనంద స్వరూపమగు ఒకతత్త్వమునుమాత్రమే

తెలిసికొనినచో అసత్ (కాలత్రయాబాధితము) చిత్ (చైతన్యరూపము) ఆనంద (ప్రియము) రూపముతో కూడిన పదార్థములన్నియును తమం తట తామే తెలియును. ఓకుమారా! ఇది ఆదేశజ్ఞానము— అనగా గురుపరంపరద్వారా లభ్యమగు జ్ఞానము.”

ఈవిధముగా శ్వేతకేతునకు అనేకదృష్టాంతములతో తత్త్వ జ్ఞానయోగ్యతయు, జిజ్ఞాసయు కలిగించుటకు ఉద్దాలకుడు ఉపదేశిం చెను. అనంతరము చెప్పెను. “స య ఏషోఽణిమైతదాత్మ్యమిదం సర్వం తత్ సత్యం స ఆత్మా తత్త్వమసి శ్వేతకేతో”

“అదియే అణురూపములోనున్న ఆత్మ. ఈసమస్తప్రపంచము దానిస్వరూపమే. అది సత్యరూపమగు పరబ్రహ్మము. ఓ శ్వేతకేతూ! అది నీస్వరూపమే. నీవుకూడ ఆరూపమే.”

ఇట్లు శ్వేతకేతునకు దృష్టాంతములద్వారా ఈ అభిప్రాయ మును 9 మార్లు ఉపదేశించెను. వానినుండి ఒకదృష్టాంతము తీసి కొనుడు.

## సత్యస్వరూపమగు పరబ్రహ్మము.

నదులు అనేకదిశలనుండి వెలువడి సముద్రములో కలియును. అవి సముద్రరూపమును పొందును. అనంతరము వానికి నేను ఫలానా నదిని అను ద్వైతబుద్ధి యుండదు. అటులనే ఈ ప్రజలందరును సత్ప దార్థమునుండియే ఆవిర్భవించిరి. తాము సద్రూపులు అని వారికి తెలి యదు. సత్ పదార్థమునుండియే జన్మించితి మనియును ఎరుగరు. వ్యాఘ్ర, సింహ, వరాహాదిరూపములు కూడ సద్రూపములే. సద్రూపము అగు సూక్ష్మకారణబ్రహ్మముయొక్క కల్పితాంశము నందు వ్యాఘ్రాదులు ఆవిర్భవించినవి. కారణరూపమగు సూక్ష్మ ఆత్మ అదియే. దానిస్వరూపమే ఈసమస్తప్రపంచమును. అదియే సత్యస్వరూపమగు పరబ్రహ్మము. ఆసత్యస్వరూపమగు పరబ్రహ్మమే నీస్వరూపము. అది నీవు.

## అభేదమును బోధించు శ్రుతులు.

శ్రుతులు స్పష్టముగా ప్రకటించుచున్నను అధికారిభేదముచే ఆచార్యులు తమతమ సంప్రదాయములయందు ద్వైతమునకు వాటిని అనువర్తింపజేసిరి. ఆయా సంప్రదాయముల ఆచార్యులు ఇతరమతములనుఖండించి తమమతమే వేదసమ్మత మయినది అని జగమును నమ్మించప్రయత్నించిరి. ఆయినను సూక్ష్మబుద్ధితో—

"తం స్వాచ్ఛరీరాత్ ప్రవృహేన్ముఞ్జాదివేషీకాం ధైర్యేణ."

"ముంజగడ్డినుండి ఈనెను తీయుటకు చాలశ్రద్ధవహించవలెను. అటులనే తన దేహముకంటె ఆత్మను వేరుగా తెలిసికొనుటకు ప్రయత్నించవలెను.—"తత్త్వమస్యాది మహావాక్యములను వినినతరువాత మననదిధ్యాసనములు చేయవలెను.అంతట తననే తన స్వరూపమగు శుద్ధబ్రహ్మస్వరూపముగా భావించును.

## అద్వైతము రాజమార్గము.

ఒకటితప్ప మరి ఏ అంకెయును వాస్తవిక మయినది కాదు. మిగిలినవి అన్నియు సాపేక్షములగుటచే కల్పితములు. ఏకత్వము ఎల్లకాలములయందును అకల్పితము. రెండుపుస్తకములున్న ద్విత్వబుద్ధి కలుగును. కాని "ఇది ఒకపుస్తకము, ఇది ఒక పుస్తకము." అను ఏకత్వబుద్ధి ప్రత్యేకముగాప్రతిపుస్తకమునందును ఉండుటచేతనే ఆ ద్విత్వబుద్ధి కలుగును. ఇట్లు ద్విత్వము అపేక్షాబుద్ధిజన్యమును, ఏకత్వబుద్ధ్యధీనమును అయియున్నది. ఏకత్వము అన్యోన్యాపేక్షము. ఎట్లన, ధాన్యపుగింజలరాశి ఒకటైనను అందు కణకణసాపేక్షముచే అనేకకణములు ఉండును. ఇది ఒక వడ్లగింజలరాశి అనునది అనపేక్షమగు ఏకత్వబుద్ధి. ఇదేవిధముగా అన్యనిరపేక్షమగు ఏకత్వమునందు అపేక్షాబుద్ధి జన్యములగు ద్వైత, విశిష్టాద్వైత, శుద్ధాద్వైతములను కల్పనలకు వీలు పడినది అట్లు చేసినను కేవలము అద్వైతబ్రహ్మము

నందు ఏవిధమగు వికృతియును సంభవించదు. పర్వతముపైకి వెళ్ళు వారిలో కొందరికి కష్టమైనను దగ్గరత్రోవ నచ్చును. కొందరికి చుట్టు అయినను కష్టములేని త్రోవ నచ్చును. అటులనే బుద్ధిభేదముచే వేరు వేరు అధికారులకు ఆచార్యులు వేరువేరు మతములను ప్రవచించిరి. కాని రాజమార్గము అద్వైత మనునది నిర్వివాదము.

శాస్త్రము చెప్పుచున్నది.

*చతుర్థో రాజయోగః స్యాత్ తద్ద్విధాభావవర్జితః।*

"నాలుగు యోగములయందును ద్వైతభావరహితమయినది రాజయోగము."

క్రమముగా అద్వైతప్రతిపాదకములగు ఋగ్యజుస్సామాథర్వ వేదములందలి మహావాక్యములను విచారింతుడు.

*ప్రజ్ఞానం బ్రహ్మ, అహం బ్రహ్మాస్మి, తత్త్వమసి, అయమాత్మా బ్రహ్మ.*

ఈ నాలుగు మహావాక్యములును పరమాత్మ అనబడు శుద్ధ బ్రహ్మమునకును జీవునకును అభేదమును బోధించును. కాని మానవునకు భూత, భావి, వర్తమానము లనబడు మూడు రకముల ప్రతిబంధములలోను ఏది మిగిలియున్నను తత్త్వజ్ఞానముయొక్క అపరోక్ష (ప్రత్యక్ష) అనుభూతి జరుగదు.

వార్తికకారులు చెప్పిరి.

*కుతస్తద్జ్ఞానమితి చేత్ తద్ధి బన్ధపరిక్షయాత్।*
*అసావపి చ భూతో వా భావీ వా వర్తతేఽథవా॥*

"ఈ అపరోక్షజ్ఞానము ఎట్లు కలుగును? అని అడిగినచో దానికి సమాధానముగా బంధనాశముచే కలుగును అని చెప్పవలెను. ఈ బంధము భూతము, భావి, వర్తమానము అని మూడు విధములు.

ఈ ప్రతిబంధకములు, వాటి నివృత్తికి ఉపాయములు అనునవి శ్రీవిద్యారణ్యస్వామివారి పంచదశియందలి జ్ఞానదీపప్రకరణమున చెప్పబడినవి.

భూతప్రతిబంధము:—స్త్రీ ధనాదుల వియోగము భూతప్రతీ బంధము. సన్యాసికి భూతకాలమందలి భార్యయందు ప్రేమ అనెడు ప్రతిబంధముచే గురువు ఉపదేశించినను తత్త్వజ్ఞానము కలుగలేదు. ఈవిషయమున క్రిందికథ ప్రపంచమున ప్రసిద్ధిచెందినది.

ఒకరాజు ఒకమహాత్మునివద్ద దీక్షను పొంది సన్యసించెను. ఆతనికి వివేకము, వైరాగ్యము అపరిమితముగ నుండెను. గురువుగారు అవి తెలిసికొనియే ఆతనికి సన్యాసదీక్ష నిచ్చెను. అనంతరము గురువు తత్త్వోపదేశము చేయ మొదలిడెను. ఎన్నియో రోజులు తత్త్వోపదేశము చేసినను శిష్యునకు జ్ఞానము కలుగలేదు. శ్రవణ, మనన, నిదిధ్యాసనములయందు ఆయనకు తన రాణియందలిప్రేమ ప్రతిబంధకమాయెను. ఆకారణముచే ఆతనికి తత్త్వజ్ఞానము కలుగలేదు. గురువు సమర్థుడగు యోగి. ఆతనికి తత్త్వజ్ఞానము కలుగకుండుటకు గల కారణము తెలిసికొని అంతవరకును తాను ఉపదేశించుచున్న క్రమమునందు మార్పు తెచ్చెను. రాణితో ఆశిష్యుడు జరిపిన భౌతిక, వ్యావహారిక సంబంధము నాధారముగా తీసికొని ఉపదేశించెను. అంతట పూర్ణజ్ఞానము కలిగెను. గురువు రాణికి శిష్యునకును గల ప్రేమను దృష్టాంతముగా తీసికొని శిష్యునకు తత్త్వోపదేశము చేసినంతనే ప్రతిబంధము నశించి తత్త్వజ్ఞానము పూర్తిగా కలిగెను.

భావిప్రతిబంధము:— శ్రుతియందు వామదేవుని దృష్టాంతమున ఈభావిప్రతిబంధము ప్రస్తావించబడినది. వామదేవుని ఆగామి ప్రతిబంధము గర్భధారణమాత్రమున పోయినది.

*గర్భ ఏవ ప్రతిపేదే వామదేవోఽహం మనురభవం సూర్యశ్చ।*

వామదేవునకు గర్భమునందుండగనే జ్ఞానము కలిగెను. "నేను మనువును, నేను సూర్యుడను" అను సర్వాత్మభావము ఆతనికి కలిగెను. గర్భధారణమాత్రముననే ఆ భావిప్రతిబంధముపోయి ఆతనికి

తత్త్వజ్ఞానము కలిగెను. భరతుని ప్రతిబంధము మూడు జన్మలయందు క్షయమును పొందె ననునది భాగవతాదులయందు ప్రసిద్ధమే.

*ఆగామీ ప్రతిబన్ధశ్చ వామదేవే సమీరితః।*
*ఏకేన జన్మనా క్షీణో భరతస్య త్రిజన్మభిః॥*

"ఆగామిప్రతిబంధము వామదేవునకు ఒకజన్మములోను, భరతునకు మూడుజన్మలలోను క్షయము నొందెను."

ఈ ఆగామిప్రతిబంధము అనగా భావిప్రతిబంధము. జన్మాంతరమునకు హేతుభూతమగు ప్రారబ్ధావశేషము. అది అనుభవించనిదే క్షీణించదు. దృఢమగు శ్రవణాదులద్వారా అది ఒకటి రెండు జన్మములయందు క్షీణించును. లేనిచో అనేకజన్మలను ఎత్తవలసివచ్చును. ఉదాహరణమునకు వామదేవుని ప్రారబ్ధము ఒకజన్మమునందు క్షీణించెను. ఒకటి జన్మ అయినను పొంది తీరవలసివచ్చెననునది నిస్సంశయము. కర్మమును అనుభవించనిదే ప్రారబ్ధము నశించదు. అదేవిధముగా భరతునకు మూడు జన్మముల అనంతరము ప్రారబ్ధము క్షయమును పొందెను.

భరతుడు మూడుజన్మలను పొందుటకు గల కారణము సాంఖ్యసూత్రములయందు ఉన్నది.

*"అసాధనానుచిన్తనం బన్ధాయ భరతవత్"*

వివేకజ్ఞానమునకు ఆంతరంగిక సాధనము లేనిదే ధర్మమునైనను సాధకుడు చింతనచేయరాదు. ఈవిషయమున భాగవతమునందు క్రిందివిధముగా ఒక ఆఖ్యాయిక కలదు.

భరతమహారాజు రాజ్యభారమును విడనాడి అరణ్యమున తపము చేయుచుండెను. ఆయన ఒకరోజున గండకినదిలో స్నానము చేయుటకు వెళ్ళెను. అప్పుడే పుట్టిన లేడిపిల్ల ఒకటి జలప్రవాహమున కొట్టుకొనిపోవుట ఆయన చూచెను. ఆయన దానిని నీటినుండి బయ

టకు తీసి పాలుపోసి పెంచెను. ఆ లేడిపిల్లపై ఆయనకు కల మక్కువ అపరిమితము. ధ్యానము చేయుటకు కూర్చొనినచో లేడిపిల్ల ఏమయినదో అని చింతించెడివాడు. ఏదైన క్రూరజంతువు ఎత్తుకొనిపోయెనేమో అని భయపడెడివాడు. ఈవిధముగా ధ్యానభంగము కలుగసాగెను. ఆ చిన్నపిల్ల అంతకంతకు పెరిగి చివరకు లేళ్లగుంపులో కలసిపోయెను. అవసానసమయమున భరతునకు లేడివిచారము తప్పలేదు. ఆదుఃఖముతోనే ఆతడు మరణించెను.

ఉత్తరజన్మమునందు భరతుడు లేడిగర్భమున జన్మించెను. హరిక్షేత్రమున పులస్త్య, పులహ మునుల ఆశ్రమములయందు కథాకాలక్షేపములు జరుగునప్పుడు ఈ హరిణము అచ్చటకు వెళ్ళి శాంతచిత్తముతో కథాశ్రవణము చేయుచుండెను. దానికి ఇతరజీవులతో సంసర్గము లేదు. శుష్కతృణమును, లతాదులను భక్షించి కాలము గడపుచుండెను. అట్లు కథవినుచుండ "నాప్రారబ్ధము ఎట్లు పూర్తి అగును." అను చింతయే హరిణమును వేధించుచుండెను. ఆ ప్రకారము ఆహరిణము దేహమును విసర్జించెను.

అనంతరజన్మమున ఆంగిరస వంశీయుడగు ఒక బ్రాహ్మణుని ఇంట జన్మించెను. ఈ బ్రాహ్మణకుమారుని రూపమున ఉన్న భరతుని శరీరము బాగుగా బలసియుండెను. ఆ బ్రాహ్మణకుమారుడు ఎవరితోనూ మాట్లాడడు. మూఘునివలె కూర్చొని యుండెడివాడు. ఈమూర్ఖుడు ఏపనికిని ఉపయోగించనందున బలసిన శరీరము ఉండుటచే పొలముపనియందు నియోగించబడెను. ఇట్లుండ ఒకరోజున రహూగణుడను రాజు పాలకీలో కూర్చొని గురువును వెతకుటకు వెళ్లుచుండెను. పాలకీని మోయువారలు అలసియుండుటచే బలిష్ఠుడగు ఈ భరతుని లాగికొనివెళ్లి మోయమనిరి. భరతుడు పాలకి మోయుచు కాలిక్రింద ఏజీవియును పడి చనిపోకుండుటకై గెంతుచు నడువ

సాగెను. ఇతర బోయీలు అతనితో కలసి నడువకుండుటచే రాజునకు కుదుపు తగిలెను. ఆతడు అడిగెను. "పాలికీ ఊగుటకు కారణమేమి?" ఇతరబోయీలు పలికిరి. "ప్రభూ, ఈక్రొత్తవాడు ఇప్పుడే మోతకు వచ్చినాడు. అందుచే త్వరగా నడచుటలేదు." రాజు క్రొత్తవానిని అడిగెను. "ఏమి నీవు చిక్కియున్నావా?" జడభరతుడు వెంటనే సమాధానము చెప్పెను. "కృశించుటయును, పుష్టినిపొందుటయును శరీర ధర్మము. నాస్వరూపముయొక్క ధర్మము కాదు." ఈమాటలు విని రాజు వెంటనే క్రిందికి దిగెను. ఈతను ఎవడో తత్త్వవేత్త అని తెలిసికొని జడభరతునకు నమస్కరించెను.

వర్తమానప్రతిబంధము నాలుగురకములు. 1 విషయాసక్తి. 2 ప్రజ్ఞా మాంద్యము 3 కుతర్కము 4. విపర్యయదురాగ్రహము.

1. విషయాసక్తి అనగా భోగములందలి కోరిక. ఇది ఈకాలమున చాలమంది జనులయందు కానవచ్చుచున్నది. మానవుడు ఈ విషయాసక్తిచే యథార్థమగు ఆత్మానుభవము దూరమయి బంధమునందు చిక్కువడును.

*కురఙ్గమాతఙ్గపతఙ్గభృఙ్గమీనాః హతాః పఞ్చభిరేవ పఞ్చ।*
*ఏకః ప్రమాదీ స కథం న హన్యతే యః సేవతే పఞ్చభిరేవ పఞ్చ॥*

"లేడి, ఏనుగు, మిడత, తుమ్మెద, చేప- ఈ ఐదును వరుసగా శ్రోత్ర, త్వక్, చక్షుః, ఘ్రాణ, రసనేంద్రియముల విషయములందు ఆసక్తిచే నాశనమును పొందుచున్నవి. అనగా ఏకేంద్రియాపరాధము చేతనే అవి నాశనము నొందుచున్నవి. ఇక మనుష్యుడు పంచేంద్రియాపరాధములకు గురియై పంచేంద్రియార్థములను సేవించినచో ఏల నశించడు? తప్పక నశించును."

ప్రజ్ఞామాంద్యము :-జడబుద్ధి. ఇదికూడ ఒక వర్తమాన ప్రతిబంధమే. తెలిసికొను శక్తియే లేనపుడు తత్త్వోపదేశము ఎట్లు జరుగును?

కుతర్కము:—తలకిందుగా వాదించు అలవాటు. ఈజగమంతయు జడము. కావున అది జడమగు కారణమునుండియే ఉద్భవించి తీరవలెను. ఎర్రని దారముతో నేయబడిన బట్ట ఎర్రగనే ఉండును. పచ్చని దారముతో నేయబడినచో పచ్చగనే యుండును. ఈ జగము జడమే. కావున ఇది అంతయు జడకారణమునుండియే ఉద్భవించి యుండవలెను. ఇట్టి కుతర్కముచే వేదాంతమునందు చెప్పబడిన ఆత్మ బ్రహ్మైక్యము అసంభవమగును.

విపర్యయదురాగ్రహము:-విపరీతమగు భావమునందు మిక్కిలి పట్టుదల. ఇది ఒక పెద్దప్రతిబంధము. ఈ ప్రతిబంధముచే "నేను జన్మ మరణములు కలవాడను. నాయందు రాగాదిదోషములు కలవు. జగద్వ్యవహారములయందు చిక్కుపడియున్నాను. అల్పశక్తి కల జీవుడను అనుమాట నిజమే. శ్రుతియందు చెప్పబడిన తత్త్వమస్యాది మహావాక్యములద్వారా చెప్పబడు ఈతత్త్వభావమంతయు అసత్యము." అను విపరీతభావము కలుగును. ఈవిధమగు ప్రతిబంధమునుండి విముక్తిని పొందిన తదుపరి తాను బ్రహ్మస్వరూపమును ప్రత్యక్షముగా అనుభవించును.

ఈ బంధములన్నిటినుండియు నివృత్తిని చెందుటకు పంచదశికారులు చెప్పుచున్నారు.

*శమాద్యైః శ్రవణాద్యైః చ తత్ర తత్రోచితైః క్షయమ్,*
*నీతేఽస్మిన్ ప్రతిబన్ధే హి స్వస్య బ్రహ్మత్వమశ్నుతే॥*

"ఆయా ప్రతిబంధముల నివృత్తికి ఆవశ్యకములగు శమదమాదులద్వారాను, శ్రవణాదులద్వారాను, ప్రతిబంధములు క్షయమును పొందినపిమ్మట స్వస్వరూపమగు బ్రహ్మత్వముయొక్క ఆనందము అనుభూతమగును." నాలుగు మహావాక్యముల అర్థము జీవ బ్రహ్మ ఐక్యము. కావున "తత్త్వమసి" ఇత్యాది మహావాక్యములచే పరోక్ష

జ్ఞానము కలుగును. మనన, నిదిధ్యాసనములు చేసినపిదప ప్రతిబంధము లన్నియు నివృత్తినిపొంది సాధకునకు కాలాంతరమున "అహంబ్రహ్మాస్మి" మొదలగు వాక్యములచే ప్రత్యక్షబ్రహ్మానుభవము అగును. అతడు జీవన్ముక్తుడగును. ఈజీవన్ముక్తుని తృప్తిని శబ్దములతో వర్ణించుట అశక్యము. అనుభవము అయినవారే వస్తువుయొక్క యథార్థతత్త్వమును తెలిసికొనగలరు. అది వర్ణించుటకు శక్యము కాదు.

ప్రత్యక్షానుభూతములగు పదార్థముల అసాధారణధర్మములు శబ్దములచే వర్ణించబడవు. పాలు, వెన్న, మిఠాయి మొదలగు వస్తువుల మాధుర్యమును సరస్వతికూడ శబ్దములచే వర్ణించలేదు; అనుభవముద్వారా ప్రత్యక్షమగు భేదమును స్ఫురింపజేయలేదు. అన్నిటియందును మాధుర్యము ఉన్నను, ఒకదానియందు ఉన్న మాధుర్యమునకును, మరియొకదానిలో నున్న మాధుర్యమునకును కల భేదము నాలుకమీాద వేసినకాని స్పష్టముగా తెలియదు. అట్లుతప్ప మరియొక విధముగా వానిభేదము ఇతరులకు తెలుపలేము. ఈ ప్రత్యక్ష ఇంద్రియానుభవమును ఆధారముగా జేసికొని విచారించినచో స్థూలపదార్థములలో ఒక ఇంద్రియమువలన కలుగు జ్ఞానము మరియొక ఇంద్రియమువలన కలుగదు. ఆ జ్ఞానము ఆ ఇంద్రియవిషయము కాదు. ఇక సూక్ష్మాతిసూక్ష్మమగు ఆత్మవిషయకమగు అనుభవమును వాణి ఎట్లు వర్ణించగలదు? ఆకారణముచే అఖండ ఏకత్వప్రకారమగు నీవు, నేను అది అను భేదములేని వాక్యార్థబోధ భాగత్యాగలక్షణావృత్తిచే నగునని "పంచదశి" కారులు మహావాక్యవివేకప్రకరణమున చెప్పిరి.

ఋగ్వేదమునందలి ఐతరేయారణ్యకమునందు "ప్రజ్ఞానం బ్రహ్మ" అను వాక్యము కలదు. వ్యక్తి నేత్రేంద్రియములద్వారా బయల్పడిన అంతఃకరణవృత్త్యుపహితమగు చైతన్యముద్వారా దర్శనవిషయములగు రూపాదులను దర్శించును. కర్ణేంద్రియముద్వారా

బయల్పడిన అంతఃకరణవృత్త్యుపహితమగు చైతన్యముద్వారా శబ్దమును శ్రవణముచేయును. ఘ్రాణముద్వారా బయల్పడిన అంతఃకరణవృత్త్యుపహితమగు చైతన్యముద్వారా గంధమును గ్రహించును. రసనేంద్రియముద్వారా బయల్పడిన అంతఃకరణవృత్త్యుపహితమగు చైతన్యముద్వారా స్వాదు, అస్వాదు రసములను తెలిసికొనును. ఇట్లు వేర్వేరు ఇంద్రియములద్వారా బయల్పడిన అంతఃకరణవృత్త్యుపహితమగు చైతన్యముద్వారా ఆయా పనులు చేయును. ఆ చైతన్యమే "ప్రజ్ఞానం బ్రహ్మ" అను మహావాక్యమునందలి "ప్రజ్ఞాన" శబ్దమునకు వాచ్యము.

బ్రహ్మ, ఇంద్ర, దేవ, మనుష్య, పశ్వాదులయందు ఒకవ్యాపిచైతన్యము కలదు. అది బ్రహ్మశబ్దవాచ్యము. అనగా నాయందుకూడ ప్రజ్ఞానరూపమగు బ్రహ్మము కలదు, ప్రజ్ఞానబ్రహ్మరూపమే నేను అనునది బ్రహ్మశబ్దమునకు భావము. ఆ అర్థమునే "అహం బ్రహ్మాస్మి"కూడ తెలుపును. పరిపూర్ణుడగు పరమాత్మ దేశ, కాల, వస్త్వతీతుడు. ఆతడు ఈ మాయాకల్పితజాగృతియందు శమదమాది సాధనసంపత్తిసహాయమున విద్యాసంపాదనమునకు తగిన శ్రవణాది అనుష్ఠానములు కల ఈమనుష్యశరీరమునందు బుద్ధిచే దర్శనీయమగు సూక్ష్మశరీరమునకు సాక్షిభూతమయి, అవికారిగానుండి, దర్శనీయుడగుటచే లక్షణాద్వారా "అహం" శబ్దవాచ్యుడగుచున్నాడు.

స్వతఃపరిపూర్ణుడగు పరమాత్మ ఈమహావాక్యమునందు బ్రహ్మశబ్దముద్వారా వర్ణించబడెను. ఈవాక్యమునందలి "అస్మి" పదముచే రెండుపదములకును సమానాధికరణ్యము కలదు. కావున రెండింటికిని ఏకత్వము సిద్ధించి జీవబ్రహ్మైకత్వము బోధ్యమయి నేను స్వయముగా ఈశ్వరస్వరూపుడనే అను యథార్థసాక్షాత్ జ్ఞానము కలుగును.

సామవేదమునందలి ఛాందోగ్యోపనిషత్తునందు కల "తత్త్వమసి" మహావాక్యము యొక్క అర్థము ఇది :—

ఛాందోగ్యమునందలి ఉపక్రమమునందు తెలిపిన "సదేవ సౌమ్యేదమగ్ర ఆసీత్, ఏకమేవాద్వితీయమ్" ఓ సౌమ్యుడగు శ్వేతకేతూ! సృష్టికి పూర్వము ఇదంతయును సద్రూపమును, అద్వితీయమును అగు ఒక పదార్థమే. స్వస్వరూపాంతర్గత సజాతీయ విజాతీయ భేదరహితమును, నామరూపాదిరహితమును అగు ఈ ప్రతిపాదితమగు సద్వస్తువు ఇప్పుడును అనగా సృష్ట్యనంతరముకూడ యథాప్రకారముగనే ఉన్నది. ఈ విషయము "తత్త్వమసి" వాక్యమునందలి 'తత్' పదముచే తెలిసికొనబడును.

ఇక త్వం పదార్థము.

శ్రవణ, మననాదులద్వారా మహావాక్యానుభూతిని పొందవలెనని కోరికగల శ్రోతకు దేహేంద్రియపరమయి, దేహేంద్రియోపలక్షితమగు స్థూల, సూక్ష్మ, కారణ, శరీరసాక్షిత్వముద్వారా శరీరత్రయవిలక్షణమగు చైతన్యమే "త్వం" పదముయొక్క లక్ష్యార్థము.

"అసి" అను పదముచే కలుగు "తత్", "త్వం" పదముల సామానాధికరణ్యముద్వారా ఏకీకృతమగు పదార్థద్వయైక్యజ్ఞానము శిష్యునకు కలుగజేయబడును. ఈవిధముగా ప్రమాణసిద్ధమగు ఐక్యమును ముముక్షువులు అనుభవించెదరు.

ఇక అథర్వవేదమునందలి "అయమాత్మా బ్రహ్మ" అను మహావాక్యముయొక్క అర్థము వివరించబడును.

'అయం' పదముచే స్వప్రకాశమగు అపరోక్షత్వము గ్రహించబడును. ఘటాదిపదార్థములు అపరోక్షములు. అనగా ప్రత్యక్షములు. అయినను జడములు. పరప్రకాశ్యములు. స్వప్రకాశ్యములు కావు.

పుణ్య, పాప రూపములగు ధర్మము లన్నియును పరోక్షములే కావున వీని అన్నిటికంటెను విలక్షణమగు వస్తుస్వప్రకాశమును ప్రత్యక్షమును కూడను. దానిని 'అయం' శబ్దముచే గ్రహించనగును. "ఆత్మా" శబ్దముద్వారా అహంకారమునుండి దేహమువరకు గల సాక్షిని లేక అధిష్ఠానమగు ప్రత్యగాత్మను గ్రహించవలెను.

ఈ కన్పట్టు సమస్త ప్రపంచముయొక్క తత్త్వమును వాక్యమునందు కల "బ్రహ్మ" పదముచే చెప్పబడినది. అనగా స్వప్రకాశము బ్రహ్మస్వరూపమగు తత్త్వమే. ఇది ఈమహావాక్యమునకు అర్థము. ఈవిధముగా ఈమహావాక్యముల అర్థమును అనుసంధానము చేసికొని మనన, నిదిధ్యాసనములు చేయుటచే ప్రత్యక్ష ఆత్మానుభవము అగును.

అనంతరము రేవాశంకరశాస్త్రి స్వామి(శ్రీప్రకాశానందుల వారితో నిట్లనిరి:— తమరు ఈవిషయమును విశేషముగా నెరుగుదురు. తమ అభిప్రాయమేమి?

## దైవసంపదను పొందుటచే ముక్తి కలుగును.

స్వా. ప్ర :— ఆచార్యుల మతములన్నియు అధికారిభేదముచే యుక్తములే. కనిష్ఠుడగు మందాధికారికి ద్వైతము తగినది. మధ్యమాధికారికి విశిష్టాద్వైతము యోగ్యమైనది. ఉత్తమాధికారికి అద్వైతము గ్రహించదగినది. ద్వైతాద్వైతవిశిష్టాద్వైతములయందు దేనిని అవలంబించినను మతమతాంతరముల వివాదములయందు చిక్కువడి ఖండనమండనములు చేయుచు, యథార్థవస్తువునకు అనగా పరమాత్మునకు సంబంధించిన జ్ఞానమును పొంది సత్యధ్యేయమును చేరుటకు ప్రయాసపడకపోయినచో నిరర్థకము. ఏమతమైనను అవలంబించుడు. అన్ని మతముల అభిప్రాయముకూడ రాగద్వేషాదులను నిర్మూలించి, భక్తి, వైరాగ్యములను పొంది ఒకే పరమాత్ముని పొం

దుటయే. నదులన్నియును సముద్రమున చేరునట్లు ఒకే పరమాత్మని పొందుటయే సర్వమతములయొక్కయు ఆశయము. ఈ ఆశయముతో నేను ద్వైత, అద్వైత, విశిష్టాద్వైతములను అన్నిమతములునుకూడ అపదార్థ ప్రతిపాదితములగుటచే త్యాజ్యములని తలచితిని. ద్వైతసాపేక్షము అద్వైతము. అద్వైతసాపేక్షము ద్వైతము. ఈ రెండును వాస్తవికరూపమున కల్పితములే. మతమతాంతరముల గందరగోళములో రాగద్వేషములు కలుగును. అష్టావక్రగీతయందు చెప్పబడినది.

నానామతం మహర్షీణాం సాధూనాం యోగినాం తథా।
దృష్ట్వా నిర్వేదమాపన్నః కో న శామ్యతి మానవః॥

"మహర్షుల మతములు అనేకములు. సాధువులకును, యోగులకును వేర్వేరు మతములు కలవు వానిని చూచిన తదుపరి వాని భేదములపై వైరాగ్యము కలిగిన ఏమానవుడు శాంతిని పొందడు?"

మతమతాంతరములనుగురించి అలర్కుని దృష్టాంతము కలదు. మదాలస నాల్గవకుమారుడు అలర్కుడు. తల్లి ఇచ్చిన తాయెదునుండి చదివిన ఉపదేశముచే వైరాగ్యమును పొందెను. ఆతడు తన పెద్దఅన్నగారగు సుబాహునివద్దకు వెళ్లి ప్రార్థించెను. "నాకు బ్రహ్మవిద్యను ఉపదేశించుడు." ఆతడు చెప్పెను. "నీవు దత్తాత్రేయగురువులవారి వద్దకు వెళ్ళుము. ఆయన నిష్పక్షపాతి. నేను నీసోదరుడను. నేను ఇచ్చిన ఉపదేశము బోధపడదు." అలర్కుడు వెంటనే దత్తాత్రేయులవారిని వెదకుటకు బయలుదేరెను. ఒక బంగారుఉంగరమును వ్రేలునకు ధరించి గురునన్వేషించుటకు బయలువెడలెను. ఆయనను తెలిసికొనుటకు ప్రముఖవ్యక్తులను ఇట్లు ప్రశ్నించెను. "ఈఉంగరము దేనితో చేయబడినది?" బంగారముతో చేయబడెనని వారు చెప్పెడివారు. అలర్కుడు "కాదు ఇత్తడిది." అని పలికెను. మరియొకనికి

"వెండిది" అని చెప్పెను. ఇట్లు అందరకును వారు చెప్పిన సమాధానములను అంగీకరించక వేర్వేరు ప్రతిసమాధానములు చెప్పెను. అంతట వారు "వేరొకచోటికి పొమ్ము. నీకు మతి లేదు" అని చెప్పెడివారు. చివరకు అలర్కుడు దత్తాత్రేయులవారివద్దకు వచ్చెను. వారిని కూడ "ఈ ఉంగరము దేనితో చేయబడిన" దని అడిగెను. ఆయన సమాధానము చెప్పెను. "బంగారపు ఉంగరము."

అలర్కుడు:— "కాదు. వెండిది."

దత్తాత్రేయుడు మరల చెప్పెను:— 'అవును'

అలర్కుడు పలికెను:— 'కాదు, ఇత్తడిది.'

దత్తాత్రేయుడు:— "అవును."

అలర్కుడు ఆవిధముగా ఎన్నిమార్లు వ్యతిరేకముగా చెప్పినను దత్తాత్రేయులు "నిజమే" అనెను. ఈసమాధానములచే "ఆయన దత్తాత్రేయులే" అని తెలిసికొనెను. అలర్కుడు ఒక్కమారుగా వారి కాళ్ళపైబడి పలికెను. "ప్రభూ, నేను ఎన్నిమారులు వంకరసమాధానములు చెప్పినను తమరు నిజమనియే చెప్పిరి. అందుకు కారణమేమి?" దత్తాత్రేయులవారు పలికిరి. "నీవు వేరువేరు ధాతువుల పేర్లు పలికితివి. అందుచేతనే నేను ప్రతిసమాధానమునకును నిజము, నిజము అని చెప్పితిని. ఏలనన నాదృష్టియందు వెండి, బంగారము, ఇత్తడి మొదలగు ధాతువు లన్నియును పార్థివములే. ఆ కారణముచేతనే నేను ప్రతిమారును "అది నిజమే" అని చెప్పితిని.

ఈదృష్టాంతముచే మతమతాంతరముల లక్ష్యమగు జ్ఞానము ఒకటే అని తెలుచున్నది.

స్వా. ని. :—దత్తాత్రేయులు ఇట్లు పలికిరి.

*బోధవిబోధైః సతతం యుక్తో ద్వైతాద్వైతైః కథమిహ ముక్తః।*
*సహజో విరజాః కథమిహ యోగీ శుద్ధనిరఞ్జన సమరసభోగీ॥*

"పరోక్ష, అపరోక్ష జ్ఞానములతో కూడినవాడు ద్వైతాద్వైత ముక్తుడని ఎట్లు చెప్పబడును? ఏలననఆతడు ద్వైత,అద్వైతములకు రెంటికిని పరుడు. ఆతడు సహజముగా త్రిగుణాతీతుడు. ఆతడు యోగి ఎట్లు అనబడును? ఆతడు శుద్ధ నిర్లిప్త సమరస ఆనందమును అనుభవించును."

స్వామివారు చెప్పినది నిజము. మతమతాంతరములను త్యాజ్యముగా నంగీకరించి వదలివేయుట యుక్తము. ప్రతివాడును జ్ఞానమును సంపాదించుట అను పురుషార్థమును చేయుటయే కర్తవ్యముగా నెరుంగవలెను.

చందూభాయి ప్రశ్నించెను.

"జ్ఞానముయొక్క వాస్తవిక స్వరూపమేమి?"

స్వా. ని. :—జ్ఞానము రెండు రకములు. పరోక్షము. అపరోక్షము. "బ్రహ్మము కలదు." అను జ్ఞానము పరోక్షజ్ఞానము. బ్రహ్మసాక్షాత్కారము అపరోక్షజ్ఞానము. కాని స్థితిభేదము ననుసరించి జ్ఞానికోటిని నాలుగువిధములుగా విభజించవచ్చును. యోగవాశిష్ఠమున ఏడు జ్ఞానభూమికలు వివరించబడినవి. అందులో మొదటి మూడును సాధనావస్థకు సంబంధించినవి. మిగిలిన నాల్గును సిద్ధావస్థకు సంబంధించినవి. ఈవిధముగనే అజ్ఞానభూమికలుకూడ ఏడు కలవు.

చందూ:- ఈవిషయమున నేను ఏమియును చదువలేదు. తమరు దయయుంచి వివరించుడు.

స్వా. ని. :—ఈవిషయమున శ్రీరామచంద్రులవారు వశిష్ఠులను ప్రశ్నించిరి.

*"కీదృశ్యో భగవన్యోగభూమికాః సప్త సిద్ధిదాః ,*
*సమాసేనేతి మే బ్రూహి సర్వతత్త్వవిదాంవర ."*

"ఓతత్త్వవేత్తలలో శ్రేష్ఠుడా! సిద్ధిని ఇచ్చు ఏడుభూమికలును ఏవి? నాకు సంక్షేపముగా చెప్పుడు."

వశిష్ఠ:—ఓ రామా! అజ్ఞానభూమికలు ఏడు. అటులనే జ్ఞాన భూమికలుకూడ ఏడు. వాని అవాంతరభేదములు అనేకములు. సహాజమగు ప్రవృత్తిమయజీవితము, విషయభోగములయందు అంతులేని తృష్ణయనెడు రసావేశము. ఈ రెండును అజ్ఞానభూమికకు అసాధారణ కారణము. సాధనచతుష్టయసహితముగా శ్రవణ, మనన, నిదిధ్యాసనములయందు ప్రవృత్తియు, తీవ్రమగు మోక్షేచ్ఛయను రసావేశము జ్ఞానభూమికకు అసాధారణకారణము. అధిష్ఠానమగు బ్రహ్మము యొక్క ఉత్కర్షకు అధీనమయిన తన అస్తిత్వోపలబ్ధి రెండు భూమికలకును సాధారణకారణము. ఈ కారణములచే రెండురకములగు భూమికలును తమతమ విషయములయందు దృఢముగా నుండును. అజ్ఞానభూమికలు ప్రపంచమునందు దుఃఖమను ఫ ల ము ను కలుగజేయును. జ్ఞానభూమికలు సంసారభ్రమణనివృత్తితో బాటు పరమానంద ప్రాప్తి అనెడు ఉత్తమఫలమును కలుగజేయును.

ఓ రాముడా! మొదట ఏడురకముల అజ్ఞానభూమికలును వినుము:—

స్వస్వరూపస్థితి జ్ఞానము. దానిఫలము ముక్తి. స్వస్వరూపస్థితి నుండి చ్యుతిని పొందుట అజ్ఞానము అనబడును. దేహాదులయందు అహంకార, మమకారములు దానిఫలము. సంతులగు జనులు శుద్ధ సన్మార్గసంవిదూపమగు స్వస్వరూపమునుండి అనగా నిజస్వరూపజ్ఞానమునుండి చలించరు. వారియందు రాగద్వేషములు ప్రవేశించవు. ఆ రాగద్వేషాభావముచే వారియందు అజ్ఞానముకూడ ప్రవేశించలేదు. ఒకవిషయమునుండి చిత్తము మరలినతరువాతనున్న మధ్యకాలమునందలి మననరహితమగు స్థితియే స్వస్వరూపస్థితి. అందు సర్వసంకల్పములును శాంతించును. అది నిశ్చలతయను ఘనస్థితి. అది నిద్ర, జడత్వ రహితము. నిద్ర స్వరూపస్థితి అనిపించుకొనదు. ఏలనన నిద్ర

అవస్థావిశేషము. అటులనే మూర్ఛయందు జడత్వము ఉండుటచే అది కూడస్వరూపస్థితి అనిపించుకొనదు. "అహం" నశించి భేదముశమించి, స్వప్రకాశము చిత్తమున స్ఫురించిన ఆస్థితిని మహాపురుషులు స్వరూపస్థితి యందురు. ఆ చైతన్యరూపమగు ప్రత్యగాత్మయందే అజ్ఞానము ఆరోపితము. ఆ అజ్ఞానముయొక్క ఏడుభూమికలును నీవు వినుము.

## ఏడు అజ్ఞానభూమికలు

1. బీజజాగ్రత్తు, 2. జాగ్రత్తు, 3. మహాజాగ్రత్తు, 4. జాగ్రత్స్వప్నము, 5. స్వప్నము, 6. స్వప్నజాగ్రత్తు, 7. సుషుప్తి అను ఏడురకములగు ఈమోహము అజ్ఞానము. ఒకదానితో మరియొకటి కలియుటచే ఇది అనేకరకములగును.

1. బీజజాగ్రత్తు :—దీని లక్షణమును వివరించెదను సృష్ట్యాదియందు మాయాబలమున నామరహితమును, నిర్మలమును అగు చిదాభాసము కల రూపము ఆవిర్భవించెను. అది భవిష్యమున ప్రాణధారణాదిక్రియలు అనుఉపాధిద్వారా చిత్తము,జీవము మొదలగు పేర్లనుపొందెను. అది జాగ్రదవస్థకు బీజము. కాన అది"బీజజాగ్రత్తు" అనబడును. అది సంవిత్తుయొక్క నూతనావస్థ.

2. జాగ్రత్తు :—బీజజాగ్రత్స్థితికి అనంతరము 'ఈస్థూల దేహమే నేను, ఈస్థూలశరీరమునకు సంబంధించిన భోగ్యపదార్థములు నావి' అనునట్టి పూర్వములేని అచలప్రత్యయము (జ్ఞానము) 'జాగ్రత్తు' అనబడును.

4. మహాజాగ్రత్తు :—స్థూలశరీరము నేను, భోగ్యపదార్థములు నావి అని పూర్వజన్మమున ఉద్భవించి, అభ్యాసముచే వృద్ధిని పొందిన ప్రత్యయము (జ్ఞానము) 'మహాజాగ్రత్తు' అనబడును.

4. జాగ్రత్ స్వప్నము :—అభ్యాసరహితమగుచు, దృఢమయిన సంకల్పముమాత్రమే స్వరూపముగా కల జాగ్రత్స్థితియందలి మనోరాజ్యము (మనోరథములు) 'జాగ్రత్స్వప్నము' అనబడును.

ద్విచంద్రప్రతీతి, ముత్యపుచిప్పయందు రజతభావము, మృగతృష్ణా భ్రాంతి మొదలగునవికూడ జాగ్రత్ స్వప్న భేదములే. అభ్యాసముచే జాగ్రదవస్థయందు స్వప్నసదృశమగు వ్యవహారము జరుగుటచే జాగ్రత్ స్వప్నము అనబడును.

5. స్వప్నము :— ఇది అనేకవిధములు. నిద్రామధ్యమందుకాని, అంతమునందుకాని, మిథ్యాపదార్థములు స్వల్పకాలము ప్రతీయమానములయి (కన్పట్టి) అనంతరము అదృశ్యములయి పిదప అవి సత్యపదార్థములు కావనియు, మిథ్యాభాసము లనియు ప్రత్యయము కలుగుట 'స్వప్నము' అనబడును.

6. స్వప్నజాగ్రత్తు:— చిరకాలము జాగ్రదభావముచే అవికసితమును, మహచ్ఛరీరయుక్తమును, దృఢాభిమానముచేగాని చిరకాలస్థాయ్యైకల్పనచేత (హరిశ్చంద్రున కొకరాత్రి 12 సంవత్సరములుగ తోచినట్లు) గానిజాగ్రద్రూపముగ వృద్ధినొందినదియు, మహాజాగ్రత్స్థితిని బడసినట్టిదియు నగు స్వప్నము 'స్వప్నజాగ్రత్తు' అనబడును.

7. సుషుప్తి :— వెనుకటి ఆరు భూమికలును కర్మభూమికలు. ఏలనన అందు కర్మఫలము అనుభవించబడును. పూర్వజన్మకర్మము అనుభవించినతదుపరి నశించి, రెండవ కర్మఫలము నిచ్చుటకు అభిముఖముగా నుండనప్పుడు ఆ రెంటికిమధ్యనుండు సూక్ష్మమును, స్థూలమును అగు సర్వప్రపంచమును లయమును పొందినందున దానికి కారణమగు అజ్ఞానముమాత్రమే శేషించుటచే అజ్ఞానోపాధికల జీవుని భావిదుఃఖకారణమగు వాసనాసహితమయిన జడసమమగుస్థితి 'సుషుప్తి' అనబడును.

ఈసుషుప్తియందు తృణము, లోష్టము, పర్వతము, శిలాది సర్వపదార్థములు పరమాణుత్వమును పొందును.

ఓ రామా! ఈవిధముగా అజ్ఞానముయొక్క ఏడుదశలును వివరించితిని. సముద్రమునందలి సుడిగుండమున నొక పడినట్లు ఏడు

అజ్ఞానభూమికలయందును జీవుడు ఒక మోహమునుండి మరియొక మోహమును పొందుచునే యుండును. ఈ ఏడుభూమికలును నానా వికారసంయుతములు. జీవుని జన్మమరణరూపమగు సంసారచక్రము నందు భ్రమింపజేయును. ఈఏడు అజ్ఞానభూమికలను పరిత్యజించ వలెను. అనంతరము ముందు చెప్పబడు జ్ఞానభూమికలను విచారించి నచో విశుద్ధమగు ప్రత్యగాత్మయొక్క అపరోక్షజ్ఞానము కలుగును. అంతట నీవు వెనుక చెప్పిన అజ్ఞానభూమికలనుండి ముక్తిని పొందగలవు.

## ఏడు జ్ఞానభూమికలు.

ఇమాం సప్తపదాం జ్ఞానభూమిమాకర్ణయానఘ।
నానయా జ్ఞాతయా భూయో మోహపఙ్కే నిమజ్జసి॥

ఓ పాపరహితుడగు రాముడా! జ్ఞానముయొక్క ఏడు భూమికలును వినుము. అభ్యాసక్రమమున ఈ ఏడుభూమికలను అనుభవించిన తదుపరి నీవు మోహపంకిలమున దిగపడవు. ఈ ఏడు జ్ఞానభూమికలును తప్పక తెలిసికొనవలెను. ఏలనన వానిచే పరమపురుషార్థము సిద్ధించును. అఖండస్వరూపవృత్తిచే ఆరూఢమయిన బ్రహ్మము అజ్ఞాననివర్తకమగుటచే జ్ఞానమనబడును. కావున ఈ ఏడుభూమికలును జ్ఞానభూమికలు అనబడును. ఆ బ్రహ్మము ఏడుభూమికలకును పరుడు. సత్యావబోధము మోక్షము. రెండును మోక్షమునకు పారిభాషికపదములు. ముక్తుడయిన జీవుడు మరల ఈజగమున జన్మించుటకాని, మృతుడగుటకాని జరుగదు.

1. శుభేచ్ఛ, 2. సువిచారణ, 3. తనుమానస, 4. సత్త్వాపత్తి. 5. అసంసక్తి, 6. పదార్థభావిని, 7. తుర్యగ అని జ్ఞానభూమికలు 7. ఈ జ్ఞానభూమికలను సమముగా అభ్యసించుటచే అధికారియగు నరుడు పరబ్రహ్మమును పొందును. ఆ ఆత్మస్వరూపమును పొందిన జనుడు శోకించడు.

## తరతి శోకమాత్మవిత్

1. శు భే చ్ఛ :—"నేను ఇంత ఆయుర్దాయమును జడత్వముతో వ్యర్థముగా ఏల పాడుచేయవలెను? ఇక మేల్కొని తప్పిన మార్గమునుండి మరలి సరియగు మార్గమున నడచెదను. ఈ సంసార మోహము అనెడు జంజాటమును పరిత్యజించి నా ఆత్మకళ్యాణము కొరకు శ్రోత్రియుడును, బ్రహ్మనిష్ఠుడును అగు గురువును శరణుజొచ్చి మోక్షశాస్త్రమును అభ్యసించి వారి ఉపదేశానుసారము ఆత్మవిచారము చేయుదును. ఈవిధమగు సాధనచతుష్టయసంపత్తితో కూడిన ఇచ్ఛ శుభేచ్ఛ. నిషిద్ధకర్మలను పరిత్యజించి, ఫలాసక్తిరహితమగు, విహితకర్మాచరణముద్వారా అంతఃకరణపారిశుద్ధ్యమును పొంది, వివేకవైరాగ్యములు, షట్ సంపత్తి, ముముక్షుత్వము అను సాధనచతుష్టయమును సంపాదించి, ముక్తియే పరిణామముగా కలిగి శ్రవణాదులయందు ప్రవర్తింపజేయు ఉపాధికల ఆత్మసాక్షాత్కారము కొరకు కలుగు ఉత్కటమగు అభిలాష 'శుభేచ్ఛ' అనబడును. ఇది జ్ఞానమునకు ప్రథమ భూమిక.

2. సు వి చా ర ణ :—తీవ్రవైరాగ్యమును అభ్యసించుటతోపాటు వేదాంతశాస్త్రముల శ్రవణ, మననములయందు ప్రవృత్తిని పొంది శ్రద్ధగా సద్గురుని సేవించుట, నిర్జనప్రదేశనివాసము, భిక్షాభోజనము మొదలగు యతిధర్మములయందు ప్రవృత్తి, సద్గురూపదిష్టములగు వాక్యములను మోక్షశాస్త్రమును తరచు విచారముచేయుట 'సువిచారణ' అనబడును ఇది జ్ఞానమునకు రెండవ భూమిక.

3. తనుమానస:—శుభేచ్ఛతోను, సువిచారణతోను కూడిన శ్రవణ, మనన నిదిధ్యాసనములచే శబ్దాదిపర్యంతము అనాసక్తితో కూడిన సవికల్ప సమాధియందు అభ్యాసముద్వారా బుద్ధి సూక్ష్మత్వమును పొందును. ఇది 'తనుమానస' అను మూడవ జ్ఞానభూమిక.

4. సత్త్వాపత్తి :—ముందు చెప్పబడిన మూడు భూమికల యందును అభ్యాసముచే బాహ్యపదార్థములయందు కల రాగసంస్కారము నిర్మూలమగును. మనస్సు విషయవాసననుండి విరక్తిని పొంది శాంతించును. మాయ, మాయాకార్యములు, అవస్థాత్రయములేని కేవల శుద్ధసన్మాత్ర, చిన్మాత్ర, ఆనందఘన ఆత్మయందు త్రిపుటిని లయ మొందించి సాక్షాత్కారపర్యంతము ఉండుట అనగా నిర్వికల్పసమాధిరూపమగు స్థితి సత్త్వాపత్తి అనునది నాలుగవ జ్ఞాన భూమిక. ఈ భూమికయందలి జనుడు బ్రహ్మవిదు డనబడును.

5. అసంసక్తి :—వెనుకటి నాలుగు భూమికల అభ్యాసముచేతను బాహ్య, ఆభ్యంతర ఆకారములతోను, వాని సంస్కారములతోను చిత్తమునకు సంసర్గము ఉండదు. సమాధిపరిపాక మను ఫలము కలుగును. ఈదశయందు చిత్తమునందు పరమానందము కలుగును. నిత్య, అపరోక్ష, బ్రహ్మాత్మభావసాక్షాత్కారము అను చమత్కారము జరుగును. ఇది 'అసంసక్తి' అను 5వ జ్ఞానభూమిక. ఇందు అవిద్యకును, అవిద్యాకార్యములకును సంబంధము లేదు. కావున దానిపేరు 'అసంసక్తి' అని వచ్చినది. ఈ ఐదవభూమికయందున్న వాడు బ్రహ్మవేత్తలలో శ్రేష్ఠుడు.

6. పదార్థభావిని :—పైన చెప్పబడిన 5 భూమికలను అభ్యసించుటచే స్వాత్మారామత్వముద్వారా కలుగు బాహ్య ఆభ్యంతర పదార్థముల దృఢమగు అప్రతీతి 'పదార్థభావిని' అను భూమిక. ఇందు అన్యుల ప్రేరణచే పదార్థభావము కలుగును. వారివలననే శరీరనిర్వహణము జరుగును. ఇది ఆరవభూమిక. ఈభూమికయందున్నవాడు బ్రహ్మవిద్వరీయుడు డనబడును.

7. తుర్యగ :—పైభూమికలను చిరకాలము అభ్యసించుట చేతను జాగ్రదాది అవస్థాత్రయమునుండి ముక్తిని పొందును. బ్రహ్మమును అఖండఆత్మరూపమున తెలిసికొనుచు ఆభూమిక

'తుర్యగ' అనబడును. ఈ ఏడవ భూమికయందలి నరుడు బ్రహ్మవిద్వరిష్ఠు డనబడును. ఈ తురీయావస్థ జీవన్ముక్తావస్థ అనికూడ చెప్పబడును. తురీయాతీతము బ్రహ్మము. ఇది విదేహముక్తియొక్క విషయము. కావున భూమికారూపమున అది లెక్కించబడదు.

ఓ రామా! ఈ ఏడుభూమికలను పొందిన మహాభాగుడు ఆత్మారాముడు. ఆమహాత్ముడు పరమపదమును పొందును.

పై ఏడుభూమికలయందును మొదటి మూడును సాధనకోటికి చెందినవి. మిగిలినవి నాలుగును సిద్ధావస్థకు సంబంధించినవి. ఈ నాలుగు భూమికలును జ్ఞానికి కలుగు విదేహముక్తియు సమానమే. కాని జీవన్ముక్తునికి మాత్రము అంతకంతకు శరీరాభాసము తగ్గిపోవును. పిదప ఉన్మత్తావస్థను పొందును. నాల్గవ భూమికవరకు ఉపదేశాది వ్యవహారములు పూర్తిగా ఆచరించగలడు. పంచమ భూమికయందు మాత్రము ఉన్మత్తావస్థను పొందును. ఒక్కొక్కప్పుడు అధికారియగు పురుషుని ఉత్తమప్రారబ్ధముచే శుక జడభరతాదులవలె ఉపదేశించిన ఉపదేశించవచ్చును కూడను. ఆరవభూమికయందు మాత్రము నడచుట, మాట్లాడుట, చూచుట మొదలగుక్రియలు అన్నియు ఆగిపోవును. ఈస్థితియందలి ఒకమహాత్ముని కుంభకోణమునందు (మద్రాసు రాష్ట్రమునందలి గ్రామము) చూచితిని. ఆయనకు మాట్లాడుట, నడచుట, చూచుట మొదలగుక్రియలు అన్నియు ఆగిపోయెను. నేత్రములుకూడ కదలుట లేదు. కదలెడివి కావు. ఎవరైన వచ్చి రెండుమూడు చంచాలు కాఫీ కంఠములోపోసిన ఒకప్పుడు కంఠము దిగెడిది. మరియొకప్పుడు దిగెడిదికాదు. జనులు ఆయనకు ఒకఆశ్రమమును నిర్మించిరి. కర్రలతో ఒక పడకకుర్చీని నిర్మించి అందు పరుండబెట్టిరి. పూలమాలలు మొదలగునవివేసి దేవునివలె ఆయనను పూజించి హారతులు ఇచ్చెడివారు. సంవత్ 1954 సం॥లో (అనగా క్రీస్తుశకము 1897వ సంవత్సరము నేను వారిదర్శనము చేసితిని. ఆ

సమయమున అచ్చటి వృద్ధులు ఆయనను 38 సంవత్సరములనుండి అదే విధముగ చూచుచున్నామని చెప్పిరి. అనంతరము ఐదారుసంవత్సరముల తరువాత ఆయన శరీరమును త్యజించెను. ఇది ఆరవభూమిక. ఏడవ భూమికయందు శరీరము 11 రోజులుమాత్రమే నిలచును అని మహాత్ముల నోట వింటిని.

ఇదంతయును శాస్త్రములయందు వ్రాయబడి ఉన్నది. అది చెప్పితిని. నేను ఇంకను మొదటి భూమికయందుకూడ లేను. నోటితో మాత్రము బ్రహ్మమునుగురించి మాట్లాడుచున్నాను.

*అనుభూతిం వినా మూఢో వృథా బ్రహ్మణి మోదతే ।*
*ప్రతిబిమ్బితశాఖాగ్రఫలాస్వాదనమోదవత్ ॥*

కొమ్మచివరనున్న పండ్లు నీటిలో ప్రతిబింబించినప్పుడు చూచి తినినంత సంతోషమును పొందునట్లు మూర్ఖులు అనుభవములేని దేవర బ్రహ్మమునందు ఆనందమును పొందితిమని చెప్పెదరు. అది వ్యర్థము. జలాశయముయొక్క తటమున కల వృక్షముల ఫలములు జలమున ప్రతిబింబించును. ఛాయను చూచి నీటిలోనున్న చేపలు వానిని తినటకు పరుగిడును. వాని రుచియొక్క మిథ్యానుభవమును పొందును. అటులనే అజ్ఞానులు శాస్త్రముద్వారానో, శ్రవణముద్వారానో, గురువుద్వారానో తెలిసికొనినంతమాత్రమున అనుభూతిని పొందకుండ "నేను బ్రహ్మమును, సాక్షిని" అని పలికి సంతోషించెదరు. అటులనే నేనుకూడ బ్రహ్మశబ్దమును నోటితో పలికి సంతోషించుచున్నాను. ఈవిషయమున తుకారాము తన అభంగునందు వ్రాసెను.

"ఇతరులకు బ్రహ్మజ్ఞానమును ఉపదేశించుచు, తాము అనుభవించక ఉండువారిముఖముపై ఉమ్మివేయుచున్నాను. వారు వైఖరిని వ్యర్థముగా కష్టపెట్టుచున్నారు. కొందరు ద్రవ్యాదులు లభించును అను కోరికతో గ్రంథములను చదువుదురు. బ్రహ్మముపై బుద్ధినిపోనిచ్చెదరు. ఇదంతయు మోసము. అక్కడ పాండురంగడు శ్రీరంగడు ఎక్కడ?

"శాంతి, క్షమ, దయ అను అలంకారములతో నీశరీరమును, మనస్సును అలంకరించుము. నారాయణుని భజించుము. కామాది షట్‌శత్రువులను జయించుము. అంతట నీవే పరబ్రహ్మము అగుదువు. బ్రహ్మజ్ఞానపు మాటలు పలుకుటచే ఎవడును బ్రహ్మము అవలేడు. ఇనుపగుగ్గిళ్ళు నమలవలెను. అప్పుడే బ్రహ్మపదమున నృత్యము చేయగలడు. అబద్ధపు సాక్ష్యము చెప్పువాడు ధనలోభముచే అసలుసంగతి ఎరుగకయే సాక్ష్యము చెప్పును. అనుభవములేనివాడు చేయు బ్రహ్మనిరూపణమునకును, అబద్ధపుసాక్ష్యమునకును భేదము లేదు. ఈబ్రహ్మజ్ఞానము నిజమని ఎవడు ఒప్పుకొనును? చిత్తమునందు ఆత్మబోధయను దృఢమగు పాదము నిలువనంతవరకు శబ్దాదియుక్తులద్వారా ఎవరు ఎన్నివిధముల నీఎదుట బ్రహ్మజ్ఞానమును ప్రతిపాదించినను నీకు దానివలన బ్రహ్మానుభవము కలుగదు. ఆత్మానుభూతి లేనిదే పైపైన శబ్దజాలముతో కూడిన ప్రతిపాదన మిథ్యామాత్రమే. ఇట్లు చేసినచో శబ్దజ్ఞానమును సంపాదంచుటకు చేసిన పరిశ్రమ విరామకాలమున ఎందుకును పనికిరాదు. "నేను బ్రహ్మము" అని నీవు జనులఎదుట పలుకుచు తిరుగుచున్నావు. కాని అంతఃకరణమునందు విషయసుఖమును అనుభవించవలెనను భావము బలముగా నున్నది. అది నీవు ఆలోచించితివా? ఓ మహానుభావా! నీవు దప్పికగొనియున్నావు. పైగా అమృతము ఎంతయో తియ్యగానుండును అని వర్ణించుచు ఇతరులఎదుట తిరుగుచున్నావు. నీయందలి తృష్ణాగ్ని జ్వలించుట శాంతించినప్పుడు నీవు నిరంతరము కేవలబ్రహ్మస్వరూపుడవు అను జ్ఞానము నీకు కలుగును."

ప్రకాశానందస్వామివారిసంగతి వేరు. కాని మనమందరము అట్టిబ్రహ్మజ్ఞానులమే.